కల్వర్టు పనులు పూర్తయ్యేనా?

- అండర్ డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణ పనుల్లో జాప్యం
- అధికారుల పర్యవేక్షణ కరువు



అచ్చంపేట- ఉప్పునుంతల రోడ్డులో...



అచ్చంపేట ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో కొనసాగుతున్న కల్వర్టు పనులు

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, ఉప్పునుంతల ప్రధాన రహదారుల్లో వరద నీటితో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో కల్వర్టుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. రెండు కల్వర్టుల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి ప్రభుత్వం రూ.1.20 కోట్లను మంజూరు చేసింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కల్వర్టుకు రూ.60 లక్షలు, ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారిపై బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ సమీపంలోని కల్వర్టుకు రూ.60 లక్షలు కేటాయించింది.

నాలుగు నెలలుగా నరకయాతన

ఈ ఏడాది జనవరిలో ఈ రెండు ప్రాంతాల్లో పనులు మొదలు పెట్టారు. కాని ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. బస్టాండు ప్రాంతంలో రెండు లైన్ల రోడ్డుపై ఒక వైపు మాత్రమే కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. ఒక్కవైపు పనులే ఇంకా పూర్తి కాకపోతే రెండో వైపు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని వాహనదారుడు ప్రశ్నిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండు ప్రాంతంలో ఒక వైపు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహన రాకపోకలు రోజుకు వేల సంఖ్యలో ఉంటుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి లోపల, బయటి నుంచి కాకుండా ఒకే వైపు నుంచి బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో శ్రీశైలం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లే ఇతర ప్రైవేటు వాహనాలతో ట్రాఫిక్ జాం అవుతోంది. అప్పుడప్పుడు చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా ఆ ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా.. సమస్య ఉత్పన్నం అవుతోంది. ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారిపై డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగిస్తున్నా... వాహన రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, గల్లీ రోడ్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. భారీ వాహనాలు వస్తే అటుగా ఇతర వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. వలపట్ల, శ్రీరాంనగర్ కాలనీల నుంచి చుట్టూ తిరుగుతూ పట్టణ ప్రాంతానికి రావాల్సి వస్తుంది.

బొడ్రాయి పండుగకు ఇబ్బందే...

పట్టణంలో ఈ నెల 30 నుంచి మే 4వరకు గ్రామ బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన, వివిధ దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో పట్టణానికి భారీగా జనాలు, వాహన రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారుల్లో కల్వర్టుల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ట్రాఫిక్‌జాం అయ్యే అవకాశాలు లేకపోలేదు. ప్రయాణికులు, సమీపంలోని దుకాణదారులు వాహనాల రద్దీతో అవస్థలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపై చేపడుతున్న కల్వర్టుల పనులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం...

త్వరగా పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇసుక కొరత ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారని, స్థానిక తహసీల్దార్‌కు ఇసుక అనుమతి కోసం అడిగాం. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఉప్పునుంతల రోడ్డులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తాం.

– లక్ష్మీపతి, ఆర్‌అండ్‌బీ ఏఈ, అచ్చంపేట

ఉగ్రవాదులను ఉరితీయాలి



కొల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కల్వకుర్తి కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



మన్ననూరులో..

నాగర్‌కర్నూల్ రూరల్/కల్వకుర్తి రూరల్/కల్వకుర్తి టౌన్/కొల్లాపూర్/మన్ననూరు: కశ్మీర్ రాష్ట్రంలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వారికి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ మాట్లాడారు. 28 మందిని కిరాతకంగా చంపిన ఉగ్రవాదులను ఉరితీయాలన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ ఉగ్రవాదుల దాడిని ఖండించారు. అదేవిధంగా కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి కృష్ణ, నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. మౌనం పాటించి నివాళులర్పించారు. కొల్లాపూర్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మన్ననూర్‌లోని వివేకానంద విగ్రహం వద్ద కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల కిరాతక చర్యను విశ్వహిందు పరిషత్ నాయకుడు కొండపల్లి మల్లేష్ తీవ్రంగా ఖండించారు. కాళ్ల నిరంజన్, రిటైర్డ్ హెచ్‌ఎం బాలశంకర్, కన్వీనర్ రవీందర్, కుంబం మల్లేష్ గౌడ్, జూపల్లి నిరంజన్, తౌటపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, గణేష్ దారమని, లక్ష్మయ్య, ప్రభాకర్, అలివేల, ఫరీదా, అరుణ, వెంకటయ్య గౌడ్, సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని తుర్కలపల్లి గ్రామ చెరువు కాల్వలకు మరమ్మతు చేపట్టాలని యువజన కాంగ్రెస్ కార్యకర్త శివప్రసాద్ గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి పంజుగులలో వినతిపత్రం అందజేశారు. చెరువుకు కాల్వలు లేకపోవడంతో చెరువులో నీళ్లు ఉన్న రైతులు ఆ నీటిని వినియోగించుకోవడానికి వీలులేకుండా పోతుందని వివరించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు శివప్రసాద్ తెలిపారు. బాలయ్య, పరుశరాములు తదితరులు ఉన్నారు.

నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కొల్లాపూర్: శ్రీశైలం నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని నిర్వాసిత నిరుద్యోగ సంఘం నాయకులు మేనుగొండ రాముయాదవ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 98 జీఓ బాధితులకు ఉద్యోగాలు కల్పిస్తామని పాలక ప్రభుత్వాలు హామీలు ఇస్తూ మోసం చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఏపీలో అక్కడి ప్రభుత్వాలు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, తెలంగాణలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనబరుస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి అండగా నాయకులు



కల్వకుర్తి రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన బీజేపీ కార్యకర్త అరవింద చారి కుటుంబానికి ఆ పార్టీ నాయకులు అండగా నిలిచారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆదేశాల మేరకు గురువారం బాధిత కుటుంబానికి నాయకులు రూ.55 వేల ఆర్థికసాయం చేశారు. ఇల్లు కూడా లేకపోవడంతో మానవత దృక్పథంతో పార్టీ కార్యాలయంలోనే వసతి కల్పించారు. మిత్ర ఫౌండేషన్ సభ్యుడు అరవింద చారి ఇద్దరు పిల్లలను పదో తరగతి వరకు చదివించేందుకు బాధ్యత తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన గుంపాల లక్ష్మమ్మ బుధవారం ప్రమాదశావశాత్తు మృతి చెందాడు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి గురువారం రూ.5వేలు ఆర్థికసాయం చేశారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన బంగారయ్య, బీరప్పలు ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.10 వేలు నాయకులకు అందజేశారు. ఈ మేరకు గ్రామంలో బాధిత కుటుంబసభ్యులకు నాయకులు ఒక్కొక్కరికి రూ.5వేలు అందజేశారు.

బడిబాట సీడీ ఆవిష్కరణ

కందనూలు: బడిబాటకు సంబంధించి స్థానిక గాయకులు ఆలపించిన పాట సీడీని గురువారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పాటలు దోహదపడుతాయన్నారు. గాయకులు పద్మాలయ, ఇద్రిస్, సీతారాంలు పాడిన పాట చాలా బాగుందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు సురేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయండి



వెల్దండ: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఆనంద్ కోరారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ రైతులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. వెంకటయ్య, రవికుమార్, అంజయ్య, సంజీవ్, బాలునాయక్, సాజ్జనాయక్ ఉన్నారు.

రేపు భూ భారతిపై అవగాహన సదస్సు

వెల్దండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 26న ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి, కొత్త ఆర్‌ఓఆర్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గురువారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరవుతారని తెలిపారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



చిన్నముద్దునూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



ముకురాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తెలకపల్లి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నముద్దునూర్‌లో సింగిల్ విండో గోదాం వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన స్ప్రింక్లర్ పైపులను ఎమ్మెల్యే అందించారు. అదేవిధంగా లక్నారంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి చేశారు. సింగిల్ విండో చైర్మన్ భాస్కర్, వైస్ చైర్మన్ యాదయ్య, బలను శ్రీరాములు, రైతులు తదిరతరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతుధర

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతుధర లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పంజుగుల, మార్చాలా, ముకురాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని, తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, ఆనంద్ కుమార్, తిరుపతి రెడ్డి, అశోక్ రెడ్డి, మల్లేపల్లి జగన్, కొండల్ తదితరులతోపాటు పలువురు ఉన్నారు.

క్వింటాల్‌కు రూ.500 బోనస్

చారకొండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురవయ్య గౌడ్ ప్రారంభించారు. సన్నాలకు రూ. 500 ల బోనస్ చెల్లిస్తుందన్నారు. ఏఓ తనూజరాజ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, సీఈఓ వెంకటయ్య, సిబ్బంది భీమయ్య, నాయకులు మహేందర్, రైతులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

చారకొండ: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ ఇంటి నిర్మాణ పనులను గురువారం అదనపు కలెక్టర్ అమరేందర్ పరిశీలించారు. ఇంటి లోపల డిజైన్, సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని పైలెట్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. వారి వెంట ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, నాయకులు తదితరులు ఉన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

అచ్చంపేట రూరల్: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. గురువారం మండలంలోని పులిజాల రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హైదరాబాద్ నుంచి రైతులు, అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ అశోక్, ఏఓ కృష్ణయ్య, మాధవరెడ్డి, రాజేందర్, గోపాల్‌రెడ్డి, రామనాథం, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత



బిజినేపల్లి: మండలంలోని మహదేవునిపేట గ్రామానికి చెందిన రైతు చిన్న చెన్నయ్య కొన్నిరోజుల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందాడు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.20 లక్షల ప్రమాదబీమా మంజూరైంది. ఈ మేరకు గురువారం బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, క్షేత్రస్థాయి అధికారి త్రినాథ్‌రెడ్డిలు బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. అధికారులు జిలానీభాష, సంతోష్, శ్యామ్, గ్రామ నాయకులు రాజేందర్‌రెడ్డి, బాలపీరు, నారాయణచారి, బాలస్వామి, రవి, రాము పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఎంపీడీఓ అంజనేయులు, ఏపీఓ చంద్రసిద్దార్థ సందర్శించారు. అదేవిధంగా ఉపాధి పనులను పరిశీలించారు. వర్షకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీల సర్వే

లింగాల: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు సంబంధించి మండలంలో మూడు రోజులుగా ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే పనులను కొనసాగిస్తున్నారు. మండలంలో 2023 మార్చి నెల నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన వివిధ రకాల పనులను సంబంధించి సర్వే బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో సర్వే కొనసాగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు పూర్తైన తర్వాత గ్రామస్థాయిలో గ్రామసభలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు. సర్వే పూర్తి నివేదికలను ఈ నెల 28న జరిగే మండల స్థాయి సామాజిక తనఖీల ప్రజావేదికలో అధికారుల సమక్షంలో పరిశీలన ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.



బాధిత కుటుంబాలకు పరామర్శ



మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను గురువారం సీబీఎం ట్రస్టు చైర్ పర్సన్ డాక్టర్ అనురాధ పరామర్శించి ఓదార్చారు. మన్ననూర్ మాజీ సర్పంచ్ మంగమ్మ భర్త రామావత్ రాంకోటి ఇటీవల మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, మాజీ ఉప సర్పంచ్ సుజాత, మంజుల, ఎంపీటీసీలు శ్రీనువాసులు, రహీం, నాయకులు వెంకటరమణ, హన్మంతిరెడ్డి, సత్యనారాయణ, తుల్యా నాయక్, రాజారాం, ఇస్మాయిల్, శంకరయ్య, యశ్వంత్, గోపాల్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

వెల్దండ: మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం అదుపుతప్పి బొలెరో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుపై పడ్డా ఆటోని తప్పించి వాహనాల రాకపోకల అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని జేకేసీడ్స్ కంపెనీ నుంచి పత్తి విత్తనాలతో కల్వకుర్తి పట్టణానికి వెళ్తుండగా మార్గమధ్యలో వెల్దండ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక రైతులు నకిలీ విత్తనాలుగా అనుమానించి వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఏఈఓ సురేష్‌గౌడు చేరుకొని విత్తనాలు, సంబంధించి రశీదలను పరిశీలించారు. గ్రామాలకు జేకేసీడ్స్ కంపెనీ నుంచి డీలర్లకు విత్తనాలు తీసుకెళ్తున్నట్లు అధికారి తెలిపారు. అనంతరం విత్తనాలను ఆటోలో కల్వకుర్తికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తాడూరు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ అంజనేయులు, ఎంపీడీ నర్సింహ అన్నారు. గురువారం మండలంలోని కేంద్రంలో పాడుబడ్డ కోనేరు బావితోపాటు, వార్డులను తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి సుజీవన్‌రెడ్డి, గ్రామస్తులు జెపాల్‌రెడ్డి, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

దళిత బహుజన వర్గాల అభ్యున్నతికి కృషి

కల్వకుర్తి రూరల్: దళిత బహుజనుల అభ్యున్నతికి కృషి చేస్తానని దళిత రత్న అవార్డు గ్రహీత ఉమాపతి అన్నారు. గురువారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో రాజన్న, భీముడు, రాము, బాలు, శేఖర్, రామచందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మన్ననూర్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం అన్నారు. గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచన మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి అధ్యక్షతన అమ్రాబాద్ మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కమిటీ మండల ఇన్‌చార్జ్ బూత్ కమిటీ సభ్యులతో చర్చించారు. పూరి గుడిసెలు, పాత రేకుల షెడ్డులలో నివాసం ఉంటున్న పేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు బాలింగం గౌడ్, మల్లికార్జున్, రేణయ్య, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేయాలని అన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పని చేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

పెంట్లవెల్లి: వచ్చేనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం మండలంలోని జటప్రోలు, గోప్లాపూర్ తదితర గ్రామాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి ఈశ్వర్ విడుదల చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాల్, వరలక్ష్మి, ఖాజా, కృష్ణయ్య, బాలరాజు, ఎల్లమ్మ, నాగమ్మ, కవిత, దేవమ్మ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జమాలుద్దీన్ విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వాసు, మాదాల రవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రామార్జును, రెహమాన్, అజార్, బద్రి, హర్షిత, జయశ్రీ పాల్గొన్నారు.

అలింకో క్యాంపు ఏర్పాటు చేయాలి

మన్ననూర్: దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలో అలింకో క్యాంపు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల అడ్వైజర్ బోర్డు కమిటీ జిల్లా సభ్యుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నివాసం ఉంటున్న దివ్యాంగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



తాడూరు: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించొద్దని సీఐ కనకయ్య అన్నారు. గురువారం పోలీసులు వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ గురుస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ మధురస్మృతులు మరువలేనివి



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బల్మూర్: విద్యార్థి దశలో గడిపిన బాల్యస్మృతులు మరువలేనివని ఎంఈఓ విష్ణుమూర్తి అన్నారు. గురువారం మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. బాల్యంలో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో గడిపిన జ్ఞాపకాల అనుభూతులను నిజజీవితంలో మరిచిపోలేమన్నారు. మిత్రులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు పూర్వ విద్యార్థి కృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో స్నేహితులు డబ్బులను పోగు చేసుకొని బాధిత కుటుంబానికి రూ.31వేల ఆర్థిక సాయం అందించారు. గురువులు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, నర్సింహారావు, గోపాల్‌రెడ్డి, మురళి, విజయభాస్కర్‌రెడ్డి, యూసుఫ్, జహంగీర్‌లను సన్మానించారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన కేజీబీవీ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

కందనూలు: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ఆరు కేజీబీవీల విద్యార్థినులు మంచి మార్కులు సాధించారని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. ఆయా కేజీబీవీల విద్యార్థినులను గురువారం జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఆయన సన్మానించి అభింనదించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో చారకొండ కేజీబీవీ విద్యార్థిని శ్రావణి, 975, నాగర్‌కర్నూల్ కేజీబీవీ ఎంపీసీ విద్యార్థిని కృష్ణవేణి 943, తెలకపల్లి కేజీబీవీ సీఈసీ విద్యార్థిని దివ్య 941, కల్వకుర్తి కేజీబీవీ ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థిని హేమలత 966 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో కొల్లాపూర్ కేజీబీవీ ఎంపీసీ విద్యార్థిని బి.అనూష 470, నాగర్‌కర్నూల్ కేజీబీవీ విద్యార్థిని విజయ 440, బిజినేపల్లి కేజీబీవీ సీఈసీ విద్యార్థిని పుష్ప 467, తెలకపల్లి కేజీబీవీ ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థిని ఎం.అనూష 492 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు వారి తల్లిదండ్రులను డీఈఓ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత చదువులు చదివించి మంచి భవిష్యత్ అందించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో జీసీడీఓ శోభారాణి, ఎస్‌ఎస్‌ఏ కార్యాలయ పర్యవేక్షకులు సుజాత, గణాంకాధికారి మధుసూదన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ తిరుపతమ్మ, ప్రత్యేకాధికారులు మంజుల, హసీనా, రమాదేవి, సుమిత్ర, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.